# సంక్రాంతి కానుక:

శ్రీ కాదంబరి వెంకటేశ్వరరావు

ఆరోజు సాయంకాలం "బీచి" మహావైభవంగా వుంది. సుప్రసిద్ధ పాటకది ప్రోగ్రాము అవటం చేత సంగీత ప్రియులందరూ బీచికి చేరుకుంటున్నారు. నేనుకూడా సంగీతప్రియుణ్ణి అవటంచేత బీచికి జేరుకున్నా. క్రిస్టమసు సెలవులవటం చేత కాలేజీలేదు. కొంతసేపటికి రేడియో ప్రారంభమైంది. అది బొంబాయి ప్రోగ్రాం. బొంబాయి టాకీసువారి "జీవన ప్రభాత్" ఫిల్ములో దేవికారాణి రికార్డు పాట వింటానికి మహోయింపుగావుంది. ఆపాటను వినగానే తలవని తలంపుగా మాకాంతం జ్ఞాపకానికొచ్చింది. అబ్బే యింక అక్కడ వుండలేకపోయేను. అచ్చంగా యీలాగే వుంటుంది మాకాంతం గొంతుక. ఆమెనుచూచి చాలాకాలమైంది. కాంత ఎదురుకుండా నిలుచున్నట్టు కాన్పించింది. ఏలాగైనా కాంతాన్నిచూచి తీరాలి. సంక్రాతిపండుగ రోజులుకూడా సమీపిస్తున్నాయి. తప్పకుండా పండుక్కి వెళ్లాలి. పండుక్కి రమ్మని వుత్తరమైనా రాలేదే. ఏలాగ వెళ్ళేది అనే వూహాల్లోలీన మయ్యాను. తర్వాత, సైగల్, కనన్‌బాల రికార్డుల వేసేరు కాని అవేవీ నాతల కెక్కడంలే. అసలు సంగీతపాటకుని ప్రోగ్రాము యింకా రానేలేదు. ఏమీతోచక యింటికి ప్రయాణ మయ్యాను...

◆ ◆ ◆

నేను మదరాసురావటం అదే మొదటిసారి. అప్పుడు నేను. బి. ఎ. చదువుతున్నా. మాతలితండ్రులకు యిష్టంలేకపోయినా మామగారి పట్టుదలవల్ల నాకు చదువుయందుండే సరదావల్లా తప్పని సరిగా రాక తప్పిందికాదు. మద్రాసులో నాకు స్నేహితులెవరూ లేరు. మాకాలేజీ కుర్రాళ్లు ఎవరైనావున్నా, అంత ప్రాణ స్నేహంకాదు. నాకు ఏమీతోచటంలేదు. పండుక్కి వెళ్లటమా, మానటమా? తప్పక వెళ్లితీరాలి కాంతాన్నిచూచి చాలాకాలమైంది, కళ్లు కాయలు కాసినట్లుగా వున్నాయి. వెడితే ఏంకానుక పట్టుకు వెళ్ళటం? ఎంత ఆలోచించినా ఏమీ తోచలే. యిది వరకు ఒక చిన్నకథను వ్రాసేను. ఆకథ యిప్పుడు నా డ్రాయరుమీద పడివుంది, చాలా బాగుందనుకున్నా దానికి "సంక్రాంతికానుక" అనేపేరు పెట్టేను. ఆ కథను తీసుకొని గదికి తాళంవేసి బజారుకీ బయలుదేరాను. ఆకథను ప్రెస్సుకి యిచ్చేను. ఆప్రెస్సు యజమానికీ నాకూ కొంత ముఖపరిచయం వుండటంవల్ల నాల్గురోజుల్లో అచ్చువేసి ఒక చిన్నపుస్తకంలా తయారుచేసి యిచ్చేడు. పుస్తకం సర్వాంగ సంశోభితంగా వుంది. చక్కటి అట్ట, దానిమీద పెద్ద అక్షరాలతో "సంక్రాంతి కానుక" అనే పేరు విరాజమానంగా వుంది.........

◆ ◆ ◆

ఒకరోజు మధ్యాహ్నం నేను బజారునుంచి యింటికి వచ్చేను. గుమ్మంలో ఒక కవరుపడివుంది. కంగారుగా కవరువిప్పి చదివేను. సంక్రాతి పండుగకు రమ్మనివుంది. యింక నాసంతోషానికి హద్దులేదు. ఇప్పుడు భగవంతుడు పూర్తిగా నాపక్షాన్నివున్నాడు. అప్పటికి పండుగ మూడురోజులుంది......ఆమధ్యాహ్నం బజారుకువెళ్లేను. నాకు కావలసిన వస్తువులూ, బట్టలూ తీసుకొన్నా. తర్వాత ఒక కోహినూరు కాలరుపిన్ను, ఒకజత లోలాకులు, ఒక ఫేస్‌పౌడరుటిన్ను, ఒక హెయిర్‌క్రీము యింకా కొన్ని సుగంధ ద్రవ్యాలూ తీసుకొని యిల్లుజేరుకున్నా. యింక నాప్రయాణం రేపే, ఆరాత్రి నాదుస్తులు. కొన్ని అవసరమైన పుస్తకాలూ అన్నీ సూటుకేసులో సర్దుకుని ప్రయాణానికి సిద్ధంగా వున్నాను......

సాయంకాలం ఏడున్నర గంటలకు ట్రామ్‌బండీమీద స్టేషను జేరుకున్నా. మెయిలు సిద్ధంగావుంది. రాజమండ్రి గోదావరి స్టేషనుకు టిక్కట్టు తీసుకొని. సూటుకేసుతో రైలెక్కేను. బండి "గుఫ్, గుఫ్, గుఫ్" మంటూ స్టేషను వదలిపెట్టింది. ఆరాత్రంతా మాప్రయాణం రైల్లోనే గడిచిపోయింది. మరునాడు ఎనిమిది గంటలకు మెయిలు గోదావరి స్టేషనులో దిగింది. అక్కడ "వెల్‌కం హోటల్లో టిఫిను తీసుకొని" డొంకాతి స్టీమరుమీద బొబ్బర్లంక జేరుకున్నా. అక్కడికి మాఅత్తారివూరు అగ్రహారం రెండుమూడు

మైళ్లుంటుంది. కార్లు వెడతాయికాని రోజస్తమానూ రైల్లో ప్రయాణం చేయటంవల్ల సరదాగా సూటుకేసు చేత పట్టుకొని ప్రకృతి రమణీయకతను వర్ణించు కొంటూ బయలుదేరాను......

♦ ♦ ♦

ప్రేమ గ్రుడ్డిది. ప్రేమకు అంతులేదు. భగవంతుని సృష్టిలో ప్రతివస్తువు ప్రతి జంతువూ, ప్రతి మానవుడూ ప్రేమకు లొంగియుండవలసిందే, ప్రేమలేని జీవితము వ్యర్థము, ప్రపంచంలోని పనులన్నీ ప్రేమ చేతనే నడుస్తున్నాయి. రుక్మాంగదుడంటి మహాత్ముడు కూడా ప్రేమమహిమవల్ల మోహినిచేతులో కీలుబొమ్మై కొడుకునికూడా చంపటానికి సిద్ధమయ్యాడు. ప్రేమ ఏపనినైనా చేయిస్తుంది. యీపని చేయవచ్చును అపని చేయకూడదూ అనేమాట లేదు. అని ప్రేమను గురించి తలపోస్తూ మాఅత్తవారివూరు సమీపానికి జేరుకున్నా. దారిలో మాబావమరది నారాయణ ఎదురుపడ్డాడు. దూరంనుంచి నన్నుచూడగానే "ఎప్పుడు వచ్చేవోయి బావా. మద్రాసు విశేషాలేమిటి? అంటూ నాచేతిలోని పెట్టి లాక్కున్నాడు." యిప్పుడే వస్తున్నాయి. యింటివద్ద అందరూ క్షేమంగావున్నారా? పాపం నీకెందుకూ యీబరువు. నాచేతికిద్దూ సూటుకేసు "అన్నాను." మరేం పరవాలేదోయి. యీ మాత్రందానికే......మాసంభాషణలతోటి వూరు జేరుకున్నాం. మమ్మల్ని చూడగానే మామరదలు సీత పరుగెత్తుకు వెళ్ళి యింట్లో చెప్పింది. నేను గుమ్మంలో అడుగుపెట్టగానే మాఅత్తగారు ఒక చెంబుతో నీళ్లు పట్టుకునుంచుంది..."నాయనా రామారావూ జాగ్రత్తగా వచ్చేవూ? నీవంట్లో కులాసాగావుందా? దారిలో ఏవిధమైన చిక్కులూ కలుగలేదు కదా? నీకు మద్రాసునీళ్లు పడ్డాయి కదా? నిన్ను తీసుకురావటానికి మీమామగారుగాని నారాయణగాని వద్దామనుకున్నారు కాని హడావుడిపనుల్లో వుండుటచే రాలేకపోయేరు. నీచదువు బాగా సాగుతోందా? అని కుశల ప్రశ్నలు వేయటం మొదలెట్టేరు మాఅత్తగారు. ఆ ప్రశ్నలకు యథారీతిగా జవాబులిస్తూ కాళ్లుకడుకొని సావిట్లో ప్రవేశించేను. మాతోడల్లుళ్ళు, వదినెగార్లు "ఎప్పుడువచ్చేవోయ్ కులాసాగా వున్నావూ" అంటూ కుశలప్రశ్నలు వేసేరు. మాచినబావమరది "కిష్టు" ఒక తువ్వాలు తీసుకువచ్చి "యిదిగో బావాతుడుచుకో కాంతం అక్కయ్య యిచ్చింది." అన్నాడు నాకు పట్టరానంత నవ్వువచ్చింది. అసలు "కిష్టు" కొంటెవాడులెండి. మొదటినుంచీ అల్లరి పిల్లవాడే......

♦ ♦ ♦

ఆరాత్రి మేమందరం భోజనాలకు కూర్చున్నాం. మామామగారు, కుశలప్రశ్నలు వేయటం మొదలెట్టేరు, కొంచెంసేపు నాచదువు విషయంలోనూ, కొంతసేపు ప్రపంచ విషయంలోనూ చర్చలు జరిగేయి..."అమ్మా బావ కాంతక్కయ్యకు మొగుడవలాట్ట కాడే? అన్నాడు కిష్టు. ఆమాటతోటి మేమందరం పక్కన నవ్వేము ఆచాటుననే నిలుచున్న మా ఆవిడ కిలకిల నవ్వింది. నాశరీరం పులకరించింది. "వెర్రి వెధవా వూరుకో కబుర్లూ నీవూను." అన్నారు మా అత్తగారు. కిష్టు బేరుమని ఏడ్వటం మొదలెట్టేడు. ఏలాగైతే మా మామగారి బుజ్జగింపులతోటీ అత్తగారి అదమాయింపులతోటీ కిష్టు వూరుకున్నాడు, మా భోజనాలు ప్రశాంతంగా జరిగిపోయినవి......

♦ ♦ ♦

పెద్దపండుగ రోజున ఉదయం మాకాఫీలు త్రాగటం అయింది. గేటుసావిట్లో యీజీచైరులో కూర్చున్నా. వీధులన్నీ రకరకాల ముగ్గులతో అలంకరింపబడి వున్నాయి. వీధిలో ఆడపిల్లలు గొబ్బెమ్మలను పెట్టి పువ్వులతోటి పూజలుచేసేరు..."సుబ్బి గొబ్బెమ్మ సుబ్బినివ్వారే, చామంతి పువ్వంటీ చెల్లెల్నివ్వారే, మొగలి పువ్వంటీ మొగుణ్ణివ్వావే, తుల్లిపువ్వంటీ తమ్ముణ్ణివ్వావే, మల్లిపువ్వంటీ మరదీనివ్వారే!" అంటూ మా మరదలు సీతావాళ్ల పొరుగింటి పిల్లలూ మూడుసార్లు గొబ్బెమ్మలచుట్టూ ప్రదక్షిణంచేసేరు. యీవిధంగా ఆడపిల్లలు ఆటల్లో నిమగ్నులైయున్నారు.....బిచ్చమెట్టు తల్లో. బిచ్చమెట్టు తల్లో. బిడ్డలుగలతల్లో, పాపలుగల తల్లీ, అంటూ గుమ్మంలో కోయదిపాడుతూ వుంది. మాబావమరది భార్య సుశీల వీధిలోకివచ్చి నవ్వుతరా." కాతం. కాతం. ఇదిగో యీలారా యీ కోయవాళ్ల పిల్లచూడు ఎంతబాగుందో నీలాల్లాగ కళ్లు ఏలా మెరుస్తున్నాయో యీలా రద్దూవదినె అని పిలచింది. నేను ప్రియదర్శనానికి రెడీగా కూర్చున్నా. నాకెదురుగావున్న గదితలుపు తెరచుకొని ముద్దుమోహన కళ్యాణమూర్తి కాతం సావిట్లోవరకూ వచ్చి

నన్ను చూచి సిగ్గుచే గిరుక్కుని వెనక్కు తిరిగి, చేతిలో వున్న చేమంతి పూలు వదినెగారిమీదకు విసరి "నేరానుపో" అంటూ, నాకేసి తిరిగి తిరిగి చూస్తూ మెరుపులామాయమైంది. నాకార్యమైన తర్వాత అదే మొదటిసారి అత్తారింటికి రావటం. అంచేత కాంతం ప్రేమామృతాన్ని ఎంత గ్రోలినా తనివితీరటం లేదు. కొంతసేపయిన తర్వాత నేనూ, మాబావతోడల్లుళ్లు కలిసి పొలానికి షికారు బయలుదేరాము. వీధిలో గంగెద్దులవాండ్రు "దూడూ వెంకన్నా" అంటూ ఎద్దులను ఆడిస్తున్నారు..."పండుగ రోజులకు బిచ్చగాండ్రవల్ల కూడా నూతన శోభగలుగుతుంది సుమండీ అన్నగారూ" అన్నాను..."నీ కవితాదృష్టి ఆసౌందర్యాన్ని గ్రోలకలదు." అన్నారు చిరునవ్వులో మా పెద్దన్నగారు. ఈవిధంగా ప్రకృతి రమణీయకతను వర్ణించుకుంటూ పొలం జేరుకున్నాం. పుష్యమాసం అగుటచే పైరు చేలు అతి అందంగా వున్నాయి. జనపచేలు పచ్చటి పువ్వులతోటి "ఘుమఘుమ" వాసనలు విరజిమ్ముతున్నాయి. కందిచెట్లు పసిరికాయలతోటి నిండి వున్నాయి. చల్లటి పిల్లవాయువులు అతిమందంగా వీస్తున్నాయి. ఆహా నిజంగా భగవంతుని సృష్టి అతి విచిత్రమైనది. పండుగలకు పల్లెటూళ్లలోవున్న శోభమరే పట్టణంలోనూ వుండదు. పల్లెటూరి జీవనం ఎంతసుఖప్రదం. చల్లటిగాలి పరిశుభ్రమైన నీరు శరీరానికి ఎంత ఆరోగ్యం. నిజంగా సౌందర్యమంతా ఆపసిరిచేలలోనే యిమిడివుంది. యీ అనుపమ సౌందర్యం కలిగిన యనాభిరామంగాయున్న ప్రకృతి సౌందర్యాన్ని మహాకవులకే వర్ణింప నలవికానవుడు యీనవీన కథకులకలములెట్లు ముందుకు సాగుతాయి? యీవిధంగా సౌందర్యోపాసనలో నిమగ్నులమై పదిగంటలకు యిల్లు జేరుకున్నాం.

◆ ◆ ◆

ఆరాత్రి మా భోజనాలైపోయినాయి. మొగవాళ్ల మందరం సావిట్లో పేకాట వేసేము. ఒకగంటసేపు ఆట అయింది. తర్వాత ఆడవాళ్ల భోజనాలు కూడా సమాప్తి అయ్యేయి. వాళ్లందరూకూడా సావిట్లోకివచ్చి కూర్చున్నారు. యిప్పుడు ఏమి ప్రోగ్రాము మారుద్దామా అనే ఆలోచనలోవున్నాం. మావదునెగార్లు చాలా బాగాపాడుతారులేండి..."ఏమే పెద్దమ్మాయీ. రాజ్యం ఒక్క త్యాగరాజకీర్తన పాడు. మీనాన్నగారు వాహా వింటారు." అన్నారు మా అత్తగారు. మావదినెగారు హార్మోనియంమీద త్యాగరాజ కీర్తనలు కొన్ని పాడింది. ఆపాటలు చాలా బాగున్నాయిలేండి. మహాయింపుగా వున్నాయి..."అయితే వదినెగారూ యీసారి తప్పక మీరు సినీమాల్లో యాక్టుచేయవచ్చును. మీగొంతుక చూచే సరికే పరవశుడౌతాడు డైరక్టరు." అన్నాను పరిహాసంగా..."ఓస్ నీహేళనకేం లేవోయీ. రామారావు, యీసారి మీ ఆవిడవంతు వచ్చింది. అదినాకంటే బాగా పాడుతుంది. దాన్ని తప్పకుండా సినీమాల్లోకి జేర్పించు నెలకు అయిదువేలిస్తారు." అంది మావదినెగారు. యుక్తిగా యుక్తిమాటలకు ఆవిడదే పెట్టినపేరు. తక్కిన వదినెలుకూడా వరస వరసగా పాడేరు. ఆఖరుకి మాఆవిడవంతు వచ్చింది....."మరదలు పిల్లా పాపం మాతమ్ముడు చాతక పక్షిలా ఎదురుచూస్తున్నాడు. ఒక కోకిలగానంచేసి మావాడిని పరవశుణ్ణిచేయి" అన్నారు మా పెద్ద తోడల్లుడుగారు. కాంతం ఏమిమాట్లాడలే. సిగ్గుచే తల్లిప్రక్కకు వెళ్ళి కూర్చుంది....."ఏమే అమ్మాయీ కాంతం అంసిగ్గతే ఎలాగే. ఒక్కపాట పాడవే....."....." నిన్నే అతడేమైనా పరాయివాడేమిటే. పాపం నీపాట విందామని కుతూహల పడుతున్నాడు."..."....." ఒకసారి చెబితే వినాలి. ఒక్కపాట పాడితే అరిగిపోతావా ఏమిటి. నీబావలందరూ నీపాటకు ఎదురుచూస్తున్నారు."....."........."అంతే మరి ఎల్లకాలం సిగ్గైతే ఏలాగూ. రేప్రొద్దున్న మొగుడుతోటి కాపరం చేయవూ. అప్పుడూ సిగ్గేనా? పాడమనగానే చక్కగా ఒకపాట పాడకూడదూ? అందుకనే నాఫిడీలుకూడా నేర్చుకున్నావు. ఏమీపాడందే ఎందుకూ ఫిడీలు యింకా వీణకూడా నేర్చుకుంటానంటున్నావు. ఎవరైనా పాడమంటే పాడకుంటా వుండటానికేనా?"...."........."......సరేలే నేచెపితే వినేపిల్లవు కావు. నీకు యిష్టముంటే పాడాలి కాని ఎందుకు నిద్రకూడా దండుగ." అన్నారు మా అత్తగారు....."అమ్మాయ్ కాంత. ఒక్క పాట పాడవమ్మా నాచిట్టితల్లీ. రేపు నీకు రాజమండ్రీనుంచి మంచి బట్టలు తీసుకువచ్చి యిస్తాను. ఏదీ ఒక్కపాట పాడు." అన్నారు మా మామగారు....."అబ్బే యిప్పుడు పాడుతుందా. పాడుతే మనమందరం వినిపోమూ? రేపు. వాళ్లాయనదగ్గర ఏకాంతంగా గదిలో

పాడుతుంది" అన్నారు మా అన్నగారు..."ఏమే చెల్లీ ఒక్క పాట పాడవే. పాటలువచ్చునే గర్వమేమిటే. యిప్పుడు పాడేవంటే మంచి బహుమతి యిస్తాడులే ......".....,"పోనీలెండి. అంత పాడవంటూంటే బలవంతం పెట్టకండి. నేనువున్నానని సిగ్గేమో. నేను వీధులోకి పోతానులెండి పాడమనండి." అన్నాను. ఏలాగైతే పదిమంది చెప్పిన తర్వాత అంగీకరించింది. సింహాన్ని చూసి బెదిరిన లేడిపిల్లా బెదురుచూపులు చూస్తూ, ఫిడేలు తంత్రులు సరిచేసి, త్యాగరాయ కీర్తనలు పాడటం మొదలుపెట్టింది. ఆ పాట విన్నంతసేపూ నేనీలోకంలోలేను. గాన ప్రవాహంలో తేలిపోయేను ......"అమ్మయ్యా యీమాత్రందానికి యింత పెంకితనం. యీపాడే పాటలు ముందేపాడుతే ఎంతబాగుంటుంది." పాపం పడుకోండి. పదిగంటలైంది. అంటూ యీ అత్తగారు లేచేరు. ఎవరికివారు. వాళ్లవాళ్ల గదులకు జేరుకున్నారు.........

♦ ♦ ♦

దోమతెరకట్టిన పందిలి పట్టిమంచాని కెదురుగా రోజువుడ్డు టేబిలుమీద కాంతంచేతితో అల్లిన లేసు గుడ్డ, దానిమీద సరస్వతీ ఫోటో అత్తరు, పునుగు, జవ్వాది మొదలైన సుగంధ ద్రవ్యాలూ. ఒక వెండి పళ్లెంలో తమలపాకులూ, అమర్చబడి వున్నాయి. గది గోడలయందు రకరకాల మహాపురుషుల చిత్రపటాలు, మధ్య మధ్య రాధాకృష్ణుల ప్రేమపటాలతోటి గది అలంకరింపబడివుంది. అగరు పుల్లలనుండి "ఘుమఘుమ" వాసనలు వెదజల్లుతున్నాయి. నాయికా నాయకుల మిద్దరంచెరీ కుర్చీలో కూర్చునివున్నారు. కాంతం తమలపాకులు కిళ్లీలు చుడుతూయుంది. ఒండొరుల యందు గాఢమైన సిగ్గు ఆవరించివుంది. ఒకరి నొకరం పలకరించుకో లేకపోతున్నాం. మూగసౌజ్ఞతప్ప, ఆమెయొక్క అపురూప సౌందర్యాన్ని చూచి లోలోపల ముగ్ధుణ్ణై పోతున్నా. పొంగి పొరలి వస్తూన్న యౌవ్వనం. ఏర్చి కూర్చిన అంగసౌష్టవం తుమ్మెద రెక్కలాంటి కనుబొమలు, కెంపుల్లాంటి పెదవులు" అంతా ఒక దేవతా కన్యకలాగుంది. ఆఖరుకి సాహసించి యీలా అన్నా. "కాంతం. నీవు మొన్న ఉదయం నావైపు చూచిన ఆమధురమైన చూపులకు ఏమి బహుమతి యిర్వవా అని చూస్తున్నా." ప్రేమమూర్తీ మహానందమైన మీ ప్రేమకంటే కోరింకేమి గావాలి. అంది మాటలు తడబడుతూ భీరుమృగిలాగ. ఆమె పెదవులనుండి అప్రయత్నంగా చిరునవ్వులు మొలకలెత్తేయి. "అయితే నానూటికేసులో ఏముందో చూసుకో" అని తాళాలు చేతికిచ్చేను. కాంతం ఆతురతతో పెట్టెతెరచింది. అందులో లోలకులు. కోహినూరు కాలరు పిన్ను. హెయిర్ క్రీము. చక్కని కథల మాసపత్రిక. "సంక్రాంతి కానుక" అనే పుస్తకం ప్రత్యక్షమయ్యేయి. ఆమె పట్టరాని సంతోషంతో తక్షణం తన పెట్టిలోకి ట్రాన్సఫరు చేసుకుంది. "లోలాకులకంటె చక్కని కథలు ప్రియతరం. దానికంటె మీ "ప్రేమ" ప్రియతరం." అంది సహజమైన మృదుమధుర స్వరంతో.........అప్రయత్నంగా నాహస్తాలామె వక్షస్థలంమీదకు పోయేయి. ఆమెను తృప్తితీర కౌగలించుకున్నా...అబ్బ ఎంత సుఖం ఎంత ఆనందం. ఎంత ప్రియతరం. ఆరాత్రంతా ప్రేమసముద్రంలోనే యీదులాడేం......

♦ ♦ ♦

మరి నాల్గురోజులకు మద్రాసులో నాలాడ్జిలో ప్రవేశించేవరకూ నాకానాటిరాత్రి కాంతం పలికిన. "లోలాకులకంటే "చక్కని కథలు" ప్రియతరం. దానికంటే మీ "ప్రేమ" ప్రియతరం అనేమాటలే ప్రతిధ్వనిస్తున్నాయి.


శక్తిమయీ

♦ శక్తి
♦ పటుత్వం
♦ ఉత్సాహం

ఇస్తుంది.

అన్ని మందులషాపుల్లో దొరుకుతుంది.

సూరజ్ ఫార్మసీ,

1/90, తిరువత్తియూరు హైరోడ్డు,
చాకలపేట, మద్రాసు.